

..విజిలెన్స్ వారోత్సవాలు

సింగరేణి సంస్థలో నేటి నుంచి విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహించనున్నారు. అవినీతి వ్యతిరేక ప్రచారం చేయనున్నారు.

8లో



విద్యుత్ అధికారులూ..

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో ఆరు మండలాల్లో విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం కలుగుతోంది.

8లో

గరిష్టం / కనిష్టం
32° / 23°

వాతావరణం

జిల్లాలో సోమవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం నుంచి చలి ప్రభావం మొదలై రాత్రి వరకు పెరుగుతుంది.

రైతులకు అండగా 'సాక్షి'

మార్కెటింగ్ శాఖ అధికారితో రేపు 'ఫోన్ ఇన్'





నరేందర్

కొత్తగూడెంఅర్బన్: పంటల కొనుగోళ్ల సీజన్ మొదలైన నేపథ్యాన రైతులకు అవగాహన కల్పించేలా 'సాక్షి' ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. ప్రస్తుతం పత్తి విక్రయాలు మొదలు కాగా కొనుగోలు కేంద్రాలు, పత్తిలో తేమ, ఇతర సందేహాలు ఉంటే రైతులు ఫోన్ ఇన్‌ను ఉపయోగించుకోవచ్చు. రైతుల సందేహాలను జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి జె.నరేందర్ నివృత్తి చేస్తారు.

తేదీ : 29-10-2024, మంగళవారం
సమయం : ఉదయం 9 నుంచి 10 గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్:
73307 33374
99497 02944

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి విశేష పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. మండల పరిధిలోని కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. క్యూలైన్ ద్వారా భక్తులు అమ్మవారిని దర్శించుకోగా, అర్చకులు అమ్మవారికి విశేష పూజలు జరిపారు. భక్తులు అన్నప్రాసనలు, ఒడి బియ్యం, పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పూజాది కార్యక్రమాల్లో ఈఓ ఎన్.రజనీకుమారి, వేదపండితులు పద్మనాభశర్మ, అర్చకుడు రవికుమార్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం

పెద్దమ్మతల్లి భక్తుల శాశ్వత అన్నదానానికి భద్రాచలం పట్టణానికి చెందిన సిహెచ్.సాయి, ఆశ్రియ రూ.5,116 విరాళాన్ని అందజేసినట్లు ఈఓ ఒక ప్రకటనలో తెలిపారు.

పర్యాటకుల జలవిహారం



బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: కిన్నెరసానిలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. ఆదివారం జిల్లా నలుమూలల నుంచే కాకుండా పొరుగు జిల్లాల నుంచి కూడా సందర్శకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. డ్యామ్ సమీపం నుంచి జలాశయాన్ని, డీర్ పార్కులోని దుప్పులను వీక్షించారు. 363 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించగా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.13,325 ఆదాయం లభించింది. 300 మంది బోటు షికారు చేయగా టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.12,230 ఆదాయం సమకూరినట్లు నిర్వాహకులు తెలిపారు.


పైసలెప్పుడిస్తరో..?

పెండింగ్‌లో ధాన్యం కొనుగోళ్ల కమీషన్

- గతేడాది ఖరీఫ్, రబీలకు సంబంధించిన డబ్బులు చెల్లించని ప్రభుత్వం
- రెండు సీజన్లలో కలిపి రూ.1.88 కోట్లకు పైగా బకాయి
- నిరీక్షిస్తున్న కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు



ధాన్యం కొనుగోలు చేస్తున్న నిర్వాహకులు (ఫైల్)



పాల్వంచరూరల్: గతేడాది ఖరీఫ్, రబీ సీజన్లలో చేపట్టిన ధాన్యం కొనుగోళ్లపై కమీషన్ చెల్లించడంలో ప్రభుత్వం జాప్యం చేస్తోంది. దీంతో డబ్బుల కోసం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు నిరీక్షిస్తున్నారు. ప్రతీ సంవత్సరం రైతులు పండించిన ధాన్యాన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ఐకేపీ గ్రూపులు, జీసీసీల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి సేకరిస్తారు. ఇందుకు ప్రభుత్వం క్వింటాకు రూ.32 చొప్పున టన్నుకు రూ.320 కమీషన్ అందిస్తుంది. కానీ గత ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించిన కమీషన్ తాలుకూ డబ్బులను ఇప్పటివరకు నిర్వాహకుల ఖాతాల్లో జమ చేయలేదు.

ఖరీఫ్‌లో రూ.1.46 కోట్లు.. రబీలో రూ. 42 లక్షలు..

గతేడాది 2023–2024 వర్షాకాలం సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 134 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా 99 కేంద్రాలు, జీసీసీ ద్వారా 32, డీఆర్‌డీఏ ద్వారా మూడు కేంద్రాలు నిర్వహించారు. ఆయా కేంద్రాల ద్వారా 43 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇందుకు సంబంధించి రూ.1.46 కోట్ల కమీషన్ పెండింగ్‌లో ఉంది. రబీలో 13వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా, రూ.42 లక్షల కమీషన్ చెల్లించాల్సి ఉంది. రెండు సీజన్లకు కలిపి కొనుగోలు కేంద్రాలకు రావాల్సిన కమీషన్ రూ.1.88 కోట్ల వరకు పెండింగ్‌లో ఉంది.

భారంగా కేంద్రాల నిర్వహణ

ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వహణ ద్వారా వచ్చే కమీషన్‌ను సంఘాల అభివృద్ధికి వినియోగిస్తుంటారు. గతేడాది ఖరీఫ్, రబీ రెండు సీజన్ల కమీషన్ రాకపోవడంతో నిర్వహణ భారంగా మారింది. జిల్లాలో ప్రతి సంవత్సరం పౌరసరఫరాల కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, గిరిజన సహకార సంఘం, ఐకేపీ సంఘాలు రైతుల నుంచి ధాన్యాన్ని ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నాయి. ఆయా సీజన్లలో సేకరించిన ధాన్యం లెక్కల ప్రకారం ఏ సీజన్‌కు ఆ సీజన్‌లో కమీషన్ డబ్బులు చెల్లించాల్సి ఉంది. కానీ రెండు సీజన్లలో కమీషన్ డబ్బులను ప్రభుత్వం ఇంకా చెల్లించలేదు. 2024 ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలు వచ్చే నెల నుంచి ప్రారంభంకానుంది. ఈ నేపథ్యంలో ఈసారి ధాన్యం కొనుగోలు చేయాలంటే భారంగా మారిందని ఆయా సంఘాల నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఖరీఫ్ సీజన్ కమీషన్ వివరాలు

నిర్వహణ	కొన్న ధాన్యం	కమీషన్
ఐకేపీ	19,039 మెట్రిక్ టన్నులు	రూ.6 లక్షలు
పీఏసీఎస్	41,783మెట్రిక్ టన్నులు	రూ.1.30 కోట్లు
జీసీసీ	3,103 మెట్రిక్ టన్నులు	రూ.9.06 లక్షలు
రబీ సీజన్‌లో..		
ఐకేపీ	1,113 మెట్రిక్ టన్నులు	రూ.3.48లక్షలు
పీఏసీఎస్	11,425 మెట్రిక్ టన్నులు	రూ.35 లక్షలు
జీసీసీ	1,169 మెట్రిక్ న్నులు	రూ.3.65లక్షలు

ప్రతిపాదనలు పంపించాం



గతేడాది ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించిన కమీషన్ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ధాన్యం కొనుగోళ్లు జరిగిన వెంటనే కేంద్రాల నిర్వాహకులకు కమీషన్ డబ్బులు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. వచ్చిన వెంటనే నిర్వాహకుల ఖాతాలో జమ చేస్తాం.

– ఎస్.త్రినాథ్ బాబు, పౌరసరఫరాల శాఖ కార్పొరేషన్ మేనేజర్

చిరుత.. చింత



- ఉమ్మడి జిల్లాలో చిరుతపులి అడుగుజాడలు
- ఏన్కూరు మండలంలో కనిపించిన పులి పిల్ల
- ఇటీవల జూలూరుపాడు మండలంలోనూ సంచారం
- పాదముద్రల ఆధారంగా నిర్ధారించిన అధికారులు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రచారం

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి జిల్లాలో చిరుతపులి సంచారం సంచలనంగా మారింది. గతంలో ఎన్నడూ లేనట్లుగా ఇటీవల తరచుగా చిరుతపులుల అడుగు జాడలు బయటపడుతున్నాయి. పూర్వ ఖమ్మం జిల్లాలో అటవీ ప్రాంతం ఎక్కువగా ఉంది. తాజాగా ఆయా ప్రాంతాల్లో చిరుతల సంచారం ఉన్నట్లుగా అటవీ అధికారులు కూడా గుర్తిస్తున్నారు. గతంలో జూలూరుపాడు – ఏన్కూరు మండలాల మధ్య అటవీ ప్రాంత సమీపంలో చిరుతపులి అడుగులను గుర్తించగా.. ఇటీవల ఏన్కూరు మండలం రేపల్లెవాడ సమీపంలో ఓ రైతు మిర్చి తోటలో చిరుతపులి పిల్ల అడుగు జాడలను గుర్తించారు.

అడవి అనుకూలంగా మారుతోందా?

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాతోపాటు ఏన్కూరు, సత్తుపల్లి తదితర ప్రాంతాల్లో అడవులు ఉన్నాయి. ఆ ప్రాంతాల్లో జంతువుల సంచారానికి అనువైన వాతావరణం కల్పించినట్లు అటవీ అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో పలుమార్లు ఈ అటవీ ప్రాంతాలకు పులులు వచ్చినట్లుగా తెలుస్తోంది. గతంలోనూ భద్రాద్రి జిల్లాలో పులులను గుర్తించారు. పులులు సంచరించాలంటే విశాలమైన అటవీ ప్రాంతం ఉండాలి. అయితే తాజాగా ఇతర రాష్ట్రాలతో అనుసంధానంతో అటవీ ప్రాంతం విస్తరించడంతో పులులు ఈ ప్రాంతాలకు వస్తున్నట్లుగా అటవీ అధికారులు గుర్తిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 10 లక్షల ఎకరాలు, ఖమ్మం జిల్లాలో 1.21 లక్షల ఎకరాల అటవీ ప్రాంతం ఉంది.

గతంలోనూ చిరుతపులి అడుగుల గుర్తింపు..

గతంలో ఏన్కూరు–జూలూరుపాడు అటవీ ప్రాంతంలో చిరుతపులి సంచరించినట్లుగా అటవీ అధికారులు గుర్తించారు. ఈ సరిహద్దు ప్రాంతంలోని మున్యాతండా–భద్రుతండా గ్రామాల మధ్య మాన్‌సింగ్ అనే రైతుకు చెందిన మిర్చి తోటలో చిరుత పులి అడుగులు గుర్తించారు. కోతులు, కొండముచ్చుల నుంచి పంటను కాపాడుకోవడానికి ఆ రైతు రాత్రి సమయంలో కుక్కను కట్టేసి వెళ్లాడు. తెల్లవారుజామున వచ్చే సరికి కుక్క కనిపించలేదు. సమీపంలో వెదకగా.. గుట్టలపైకి కుక్కను లాక్కెళ్లిన జాడలు కనిపిచడంతో రైతు అటవీ అధికారులకు సమాచారం అందించారు. అటవీ అధికారులు వచ్చి మిర్చి తోటలో పరిశీలించగా జంతువు అడుగులు కనిపించాయి. వీటిని పరిశీలించడంతోపాటు కుక్కను లాక్కెళ్లిన విధానాన్ని చూసిన అధికారులు ఆడ చిరుతపులిగా నిర్ధారించారు.

తాజాగా ఏన్కూరు మండలంలో..

రెండు రోజుల క్రితం మరోసారి చిరుతపులి కలకలం సృష్టించింది. ఏన్కూరు మండలం రేపల్లెవాడ సమీపంలో ఓ మిర్చితోటలో చిరుతపులి పిల్లను గుర్తించారు. తోటకు కాపలా ఉన్న వ్యక్తి చిరుతపులి పిల్లను గమనించి వీడియో తీశాడు. ఈ విషయాన్ని రైతు అటవీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు మిర్చితోటకు చేరుకుని అక్కడ ఉన్న పాదముద్రలను సేకరించారు. ఈ పాదముద్రలు చిరుత పులి పిల్లవిగా చెబుతుండటంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ అధికారులు గ్రామాల్లో చాటింపు వేయిచారు.

ఆందోళనలో రైతులు, ప్రజలు

చిరుత పులి సంచరిస్తున్నట్లు జరుగుతున్న ప్రచారంతో సమీప ప్రాంతాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ఈ ఒక్కసారే కాకుండా గతంలోనూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పలుమార్లు పాదముద్రలను గుర్తించగా.. ఏన్కూరు మండలంలో మరోసారి చిరుతపులి సంచరిస్తుందన్న వార్త సంచలనం కలిగిస్తోంది. ఏన్కూరు మండలంలో అటవీ ప్రాంతం ఉండటం, ఈ అటవీ ప్రాంతం సమీపంలోనే పొలాలు ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి సమయాల్లో పొలాలకు కాపలా కాసేందుకు వెళ్లాలంటేనే జంకుతున్నారు.

చిరుతపులులు సంచరిస్తున్నాయా?

జిల్లాలో చిరుతపులుల జాడలు కనిపిస్తుండటంతో నిజంగా జిల్లా అటవీ ప్రాంతంలో పులులు సంచరిస్తున్నాయా..? ఇక్కడ సంచరించడానికి అనుకూలమైన వాతావరణం ఉందా అనే చర్చ ప్రజల్లో సాగుతోంది. అయితే జరుగుతున్న సంఘటనలు, అటవీ అధికారులు చెబుతున్నది పరిశీలిస్తే మాత్రం చిరుతపులి సంచారాన్ని కొట్టిపారేయలేమనే వాదనలు వినిపిస్తున్నాయి. వీటితోపాటు గతంలోనూ పలుచోట్ల పొలాల్లో పాదముద్రలను గుర్తించారు. ప్రధానంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అటవీ ప్రాతంతో పాటు పొలాల్లో వీటి పాదముద్రలను సేకరించారు. ప్రస్తుతం ఏన్కూరు మండలంలోని రేపల్లెవాడ గ్రామ సమీపంలో మాత్రం అడుగు జాడలే కాకుండా చిరుతపులి పిల్ల సంచారం కూడా సెల్‌ఫోన్‌లో చిత్రీకరించారు. దీంతో అటవీ ప్రాంతంలో జంతువులు సంచరిస్తున్నాయని, అవి రాత్రి సమయంలో సమీపంలోని పొలాల్లోకి వస్తున్నాయనే చర్చ సాగుతోంది. ఇటీవలే ఏన్కూరు, జూలూరుపాడు మండలాల మధ్య ఆడ చిరుతపులి సంచరిస్తున్నట్లుగా అనుమానాలు వ్యక్తం కాగా.. ప్రస్తుతం అదే మండలంలో చిరుతపులి పిల్ల కనిపించడంతో ఆ చిరుత పిల్లలను పెట్టి ఉంటుందనే చర్చ జరుగుతోంది.

ఏళ్లుగా ఎదురుచూపులు..

- డయాలసిస్ బాధితులకు పింఛన్ కష్టాలు
- ఉమ్మడి జిల్లాలోని 584 మందికి గాను 240 మందికే పెన్షన్
- తమకూ మంజూరు చేయాలని మిగతా వారి వేడుకోలు



ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో రక్తశుద్ధి చేయించుకుంటున్న బాధితులు

ఖమ్మంవైద్యవిభాగం: పింఛన్ కోసం కిడ్నీ బాధితులు ఎదురు చూస్తున్నారు. ఏళ్లుగా డయాలసిస్ చేయించుకుంటూ ఇబ్బంది పడుతున్నా తమకు పింఛన్ విడుదల చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూత్రపిండాల వ్యాధితో బాధపడుతూ వ్యయ ప్రయాసలకు ఓర్చి సుదూర ప్రాంతాలకు వెళ్లి చాలా మంది రక్త శుద్ధి చేయించుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో వేలాది మంది కిడ్నీ బాధితులు ఉన్నా వారికి సరిపడా డయాలసిస్ సెంటర్లు అందుబాటులో లేవు. చాలా మందికి పెన్షన్ కూడా అందడం లేదు. దీంతో బాధితులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే తమకు పింఛన్ విడుదల చేయాలని వేడుకుంటున్నారు.

సగం మందికి పైగా అందని పెన్షన్

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో డయాలసిస్ చేయించుకుంటున్న వారిలో సగం మందికి పైగా పింఛన్ అందడం లేదు. మొత్తం 584 మంది వివిధ కేంద్రాల్లో డయాలసిస్ చేయించుకుంటున్నారు. ఖమ్మం జిల్లాలో 359 మంది, భద్రాద్రి జిల్లాలో 225 మంది ఉండగా, మొత్తంగా 240 మందికి మాత్రమే పెన్షన్ అందుతోంది. మిగతా వారు 3, 4 ఏళ్లుగా పింఛన్ ఎప్పుడు వస్తుందోనని ఎదురు చూస్తున్నారు.

డయాలసిస్ బాధితులు సాధారణంగా ఏ పనులూ చేయడానికి అవకాశం ఉండదు. వారంలో రెండు, మూడు సార్లు రక్త శుద్ధి చేయించుకోవడంతో తీవ్రంగా నీరసించిపోతారు. దీంతో వారికి కేంద్రాల చుట్టూ తిరగడమే సరిపోతోంది. అయితే ప్రభుత్వం అందించే పింఛన్ అయినా ఇస్తే కొంత మేర అవసరాలకు ఉపయోగపడుతుందని ఆశగా ఎదురు చూస్తున్నారు. కానీ వారికి నిరాశే మిగులుతోంది. ఇప్పటికే పింఛన్ కోసం ఎదురు చూసి అందకుండానే కొందరు మృత్యువాత పడ్డారు. డయాలసిస్ బాధితులకు ప్రభుత్వం ఉచితంగా సేవలు అందిస్తున్నా, మందులు, ప్రయాణ ఖర్చులు మాత్రం భరించడం లేదు. దీంతో ఆర్థికంగా మరింత చితికి పోతున్నారు.

ఉమ్మడి జిల్లాలో 584 మందికి దయాలసిస్

ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు డయాలసిస్ కేంద్రాలు 10 మాత్రమే ఉన్నాయి. వాటిలో షిఫ్టుల వారీగా 584 మంది డయాలసిస్ చేయించుకుంటున్నారు. కొందరు వారంలో మూడు, నాలుగు సార్లు చేయించుకుంటుండగా, మరి కొందరు 1, 2 సార్లు చేయించుకోవాల్సి వస్తోంది. డయాలసిస్ చేయించుకోవడానికి అవకాశం లేక మరి కొందరు ఇతర ప్రాంతాలకు వెళ్లి రక్త శుద్ధి చేయించుకుంటున్నారు. ఆర్థిక స్తోమత లేని వారు చేసేది లేక ఇంటి వద్దనే ఉంటూ త్వరగా తనువు చాలిస్తున్నారు. అయితే ఖమ్మం జిల్లాలో ఖమ్మం, సత్తుపల్లి ప్రభుత్వ ఆస్పత్రులు, మమత, శ్రీరక్ష, సాయి మారుతి ప్రైవేటు ఆస్పత్రుల్లో డయాలసిస్ కేంద్రాలు ఉన్నాయి. అలాగే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భద్రాచలం, కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు, అశ్వారావుపేట ప్రభుత్వ ఆస్పత్రుల్లో డయాలసిస్ కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో డయాలసిస్ చేయించుకుంటున్న బాధితుల్లో ఎక్కువ మంది నిరుపేదలే ఉంటున్నారు. ప్రభుత్వం అందించే పింఛన్ కోసం వారు వేయికళ్లతో ఎదురు చూస్తున్నారు.

పింఛన్ ఇప్పించండి



గత రెండేళ్లుగా డయాలసిస్ చేయించుకుంటున్నా. వారంలో మూడు సార్లు ఆస్పత్రికి రావాల్సి వస్తోంది. ప్రయాణ ఖర్చులు ఎక్కువ అవుతున్నాయి. పింఛన్ అయినా వస్తుందని ఎదురు చూస్తున్నా. అధికారులు వెంటనే పింఛన్ ఇప్పించేలా చూడాలి. మందుల కొనుగోలుకు ఇబ్బంది పడుతున్నాను. మందులు కూడా అందించాలి.

– పి.అలివేలు, తుమ్మలపల్లి, కొణిజర్ల మండలం

నేడు ప్రజావాణి

సూపర్‌బజార్(కొత్తగూడెం): కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను లిఖిత పూర్వకంగా అందజేయాలని సూచించారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆదేశించారు.

నేడు ఐటీడీఏలో గిరిజన దర్బార్

భద్రాచలం: భద్రాచలం ఐటీడీఏలో సోమవారం గిరిజన దర్బార్ నిర్వహించనున్నట్లు పీఓ బి.రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల యూనిట్ అధికారులు, సిబ్బంది సకాలంలో హాజరు కావాలని పేర్కొన్నారు. గిరిజనులు తమ సమస్యలను దర్బార్‌కు హాజరై విన్నవించవచ్చని వెల్లడించారు.

రామయ్యకు సువర్ణ పుష్పార్చన



స్వామివారికి నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్ర స్వామివారి దేవస్థానం అంతరాలయంలో మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. చిత్రకూట మండపంలో నిత్యకల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా వర్షాకాలం సీజన్ ముగియటం, కార్తీక మాసం సమీపిస్తున్న నేపథ్యంలో భక్తుల రాక క్రమంగా పెరుగుతుంది. ఆదివారం నిత్యకల్యాణంలో సైతం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్తీక మాసంలో ప్రత్యేక పూజలతోపాటు నిర్దేశిత తేదీల్లో సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతాలను జరపనున్నట్లు ఆలయ అధికారులు ఇప్పటికే ప్రకటించారు. నవంబర్ 27న గోదావరి నదీ హారతి జరపాలని వైదిక కమిటీ, దేవస్థానం అధికారులు నిర్ణయించారు.

రేపు హాకీ, కరాటే ఎంపికలు

కొత్తగూడెంఅర్బన్: ఈ నెల 29వ తేదీన ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయిలో అండర్–14,17 బాలబాలికల హాకీ, కరాటే క్రీడాకారుల ఎంపికలు కొత్తగూడెంలో నిర్వహించనున్నట్లు ఉభయ జిల్లాల పాఠశాలల క్రీడా కార్యదర్శులు వాసిరెడ్డి నరేష్ కుమార్, ఓ.నర్సింహులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరామచంద్ర ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల క్రీడా ప్రాంగణంలో హాకీ, గాజులరాజం బస్తీ హనుమాన్ టెంపుల్ సమీపంలోని ఎంపవర్‌మెంట్ సెంటర్‌లో కరాటే ఎంపికలు నిర్వహించనున్నట్లు వివరించారు. 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థులే ఎంపికలకు అర్హులని పేర్కొన్నారు.

క్లుప్తంగా

లక్ష్యం మేరకు పూర్తిచేయాలి



మాట్లాడుతున్న కొండపల్లి శ్రీధర్‌రెడ్డి

పాల్వంచరూరల్: బీజేపీ సభ్యత్వాల నమోదును లక్ష్యం మేరకు పూర్తి చేయాలని అసెంబ్లీ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జ్, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్లో ఆదివారం కొత్తగూడెం నియోజకవర్గస్థాయి సభ్యత్వ నమోదుపై సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో పార్టీ సభ్యత్వ నమోదును పూర్తి చేయాలన్నారు. అనంతరం తాండ్ర వినోద్‌రావు మాట్లాడారు. కార్యకర్తలు రానున్న స్థానిక సంస్థలకు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని, ఏపార్టీకైనా సభ్యత్వాలే పునాది అని పేర్కొన్నారు. సమావేశంలో బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జీవీ మనోహర్, జల్లారపు శ్రీనివాస్, భూక్య సీతారాంనాయక్, రమేశ్‌బాబు, రంజిత్, రవీందర్ పాల్గొన్నారు.

బెటాలియన్ కానిస్టేబుళ్ల నిరసన



ఆందోళన చేస్తున్న పోలీసు కానిస్టేబుళ్లు

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండలో ఉన్న ఆరో బెటాలియన్ క్యాంప్ కార్యాలయం వద్ద కానిస్టేబుళ్లు ఆదివారం ధర్నా నిర్వహించారు. శనివారం కుటుంబ సభ్యులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఐదుగురు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేశారు. వారిని విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ కమాండెంట్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా కానిస్టేబుళ్లు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 39 మందిపై సస్పెన్షన్ వేటుని ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా బెటాలియన్లలో పనిచేస్తున్న 9,900 మంది కానిస్టేబుళ్లు స్వచ్ఛందంగా రాజీనామా చేస్తారని పేర్కొన్నారు. తమ వెనుక ఏ రాజకీయ పార్టీ లేదని, ఏక్ పోలీసు ఏక్ స్టేట్ విధానం అమలు చేయాలని కోరారు. బ్రిటిష్ కాలం నాటి విధానాలను తొలగించి నూతన విధానాన్ని అమలు చేయాలన్నారు.

పార్టీ అభివృద్ధికి సమష్టిగా పనిచేద్దాం..




మాట్లాడుతున్న రంగాకిరణ్

చుంచుపల్లి: జిల్లాలో బీజేపీ అభివృద్ధి కోసం కలిసికట్టుగా పనిచేద్దామని, సభ్యత్వాల నమోదులోనూ జిల్లాను అగ్రభాగాన నిలుపుదామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కేవీ రంగాకిరణ్ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కార్యాలయంలో సభ్యత్వ నమోదుకు సంబంధించి సమావేశం నిర్వహించగా రంగాకిరణ్ పాల్గొని మాట్లాడారు. సభ్యత్వాల విషయంలో ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని తెలిపారు. ప్రతి నాయకుడు కనీసం వంద సాధారణ సభ్యత్వాలు నమోదు చేయించాలని చెప్పారు. సమావేశంలో పానిశెట్టి వెంకటేశ్వర్లు, కొలిక పోగు మునలయ్య, బైరి నిర్మల, కుంజా ధర్మ, కొదమసింహం పాండురంగాచార్యులు, ఆకుల నాగేశ్వరావుగౌడ్, గొట్టిపోళ్ల శ్రీనివాస్, నోముల రమేశ్, గొడుగు శ్రీధర్, భూక్యా రాజేశ్‌నాయక్, మాలోత్ గాంధీ, పోలోజు క్రాంతి, బండారి చందు, గుగులోత్ శంకర్, బాలకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పశువుల పట్టివేత

దుమ్ముగూడెం: మండలంలోని గంగోలు గోదావరి నుంచి అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న 34 పశువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం కొందరు పశువులను గంగోలు గోదావరి నుంచి పడవల ద్వారా అవతలి ఒడ్డుకు తరలించడానికి సిద్ధమవగా పోలీసులు చేరుకుని పశువులను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆదివారం కావడంతో వెటర్నరీ డాక్టర్ అందుబాటులో లేక పశువులను అక్కడే ఉంచారు. నిందితులపై కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.


యువతికి పాముకాటు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువతి

చండ్రుగొండ: మండలంలోని మహ్మద్‌నగర్ గ్రామానికి చెందిన యువతి సయ్యద్ వహీద పాముకాటుకు గురైంది. గ్రామానికి చెందిన సయ్యద్ వలీ కుమార్తె వహీద గ్రామస్తులతో కలిసి మండలంలోని కరిశెలబోడు గ్రామానికి ఆదివారం పత్తి తీసేందుకు వెళ్లింది. ఈ క్రమంలో పాము కాటు వేయడంతో ఆమెను తొలుత చండ్రుగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి.. అక్కడి నుంచి కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. యువతి ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.17,043

విద్యుత్ అధికారులూ.. పట్టించుకోండి

- ప్రత్యామ్నాయ ఫీడర్ ఏర్పాటులో వీడని నిర్లక్ష్యం
- ఉన్న ఒక్కటీ మొరాయిస్తే ఆరు మండలాలకు కరెంట్ కట్
- ఆదివారం ఐదు గంటల పాటు స్తంభించిన సరఫరా
- ఎవరికీ పట్టని వినియోగదారుల గోడు



ఇల్లెందులోని 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్

ఇల్లెందురూరల్: విద్యుత్ సరఫరా వ్యవస్థలో ప్రాథమిక జాగ్రత్తలను గాలికొదిలేసిన ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు వినియోగదారులకు తరచూ ఇబ్బందులు సృష్టిస్తున్నారు. గ్రిడ్ నుంచి ప్రధాన సబ్‌స్టేషన్లకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు ఒకటికి మించి ఫీడర్లను ఏర్పాటు చేస్తారు. ఇది మెరుగైన విద్యుత్ సరఫరాకు ట్రాన్స్‌కో అవలంబించే ప్రథమ సూత్రం. కానీ, బూడిదంపాడు వద్ద ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు విద్యుత్ సరఫరా వ్యవస్థలో నిబంధనలు, ప్రాథమిక సూత్రాలను పట్టించుకోవడంలేదనే విషయం.. ప్రస్తుత విద్యుత్ సరఫరా వ్యవస్థను పరిశీలిస్తే అవగతమవుతుంది. అందుకు ఆదివారం ఆరు మండలాల పరిధిలో స్తంభించిన విద్యుత్ సరఫరా కారణంగా ప్రజలు పడిన ఇబ్బందులే నిదర్శనం.

ఏళ్లుగా ఇదే సమస్య..

ఖమ్మం జిల్లా బూడిదంపాడు 400 కేవీ గ్రిడ్ నుంచి ఇల్లెందు 132 కేవీ సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా జరుగుతోంది. ఇక్కడి నుంచి ఇల్లెందు మున్సిపాలిటీ, మండలం, టేకులపల్లి, గుండాల, ఆళ్లపల్లి, కారేపల్లి, కామేపల్లి మండలాలలోని 130 కేవీ సబ్‌స్టేషన్లకు విద్యుత్ సరఫరా అవుతోంది. అక్కడి నుంచి ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలోని వినియోగదారులకు విద్యుత్ అందిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. బూడిదంపాడు నుంచి ఇల్లెందు 132 కేవీ సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా చేసేందుకు కేవలం ఒక ఫీడర్‌ను మాత్రమే ఏర్పాటు చేశారు. కానీ రాష్ట్రంలో ఏ ఇతర 132 కేవీ సబ్‌స్టేషన్‌కైనా రెండు అంతకు మించిన ఫీడర్లు ఏర్పాటు చేశారు. ఒక ఫీడర్‌లో సమస్య ఉత్పన్నమైతే రెండో ఫీడర్ ద్వారా విద్యుత్ సరఫరా అందిస్తారు. కానీ, ఇల్లెందు 132 కేవీ సబ్‌స్టేషన్‌కు మాత్రం ఏళ్ల తరబడి ఒక్క ఫీడర్ ద్వారానే విద్యుత్ సరఫరా కొనసాగుతోంది. ఈ ఫీడర్‌లో సమస్య ఉత్పన్నమైన సందర్భంలో ఆరు మండలాల ప్రజలు మరమ్మతులు పూర్తయ్యే వరకు విద్యుత్ కోతను అనుభవించాల్సిందే.

చిరువ్యాపారులకు పెద్ద నష్టం..

నష్టాల భారం కారణంగా ఎప్పుడు మూతపడుతాయో తెలియని స్థితికి చేరుకున్న మూడు పెంకు పరిశ్రమలు ఇల్లెందు మండలంలో ఉన్నాయి. వీటితోపాటు విద్యుత్ ఆధారిత చిన్నచిన్న దుకాణాలు, కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని ఆరు మండలాల పరిధిలో వేలాదిమంది ఉపాధి పొందుతున్నారు. నెలలో కనీసం మూడు, నాలుగు సార్లు బూడిదంపాడు నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడటం వల్ల వారంతా తీవ్రంగా నష్టపోతున్నారు. ఇల్లెందు సబ్‌స్టేషన్ పరిధిలోని ఆరు మండలాల్లో ఒకటి, రెండు మండలాలు మినహాయిస్తే వంద ఎకరాలకు సాగునీటిని అందించగలిగే చెరువులు కనిపించవు. ఈ కారణంగా అత్యధిక సంఖ్యలో రైతులు ఆకాశపాయ పంటలను, బోర్లు, బావుల కింద పంటలను సాగు చేస్తున్నారు. ఇల్లెందు, టేకులపల్లి మండలాల్లో కూరగాయల సాగు కూడా చెప్పుకోతగ్గ విస్తీర్ణంలో ఉంటుంది. ఉద్యాన పంటలు సాగు చేసే రైతులందరికీ విద్యుత్ సరఫరా ప్రధాన ఆధారం. ఇంతటి ప్రాధాన్యం కలిగిన చోట విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడటం రైతులను ఇబ్బందులకు గురిచేస్తోంది.

ప్రత్యామ్నాయ వ్యయం రూ.కోటి

బూడిదంపాడు 400 కేవీ సబ్‌స్టేషన్ నుంచి ఇల్లెందు 132 కేవీ సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా కోసం ప్రస్తుతం ఒక్క ఫీడర్‌ను మాత్రమే ఏర్పాటు చేశారు. తరచూ సమస్యలు ఉత్పన్నమవుతున్నా ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు మాత్రం అదనపు ఫీడర్ అవసరాన్ని విస్మరిస్తున్నారు. ప్రస్తుతం బూడిదంపాడు నుంచి ఇల్లెందు 132 కేవీ సబ్‌స్టేషన్ వరకు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. అవే విద్యుత్ స్తంభాలకు మరోవైపుగా వేరొక ఫీడర్‌ను ఏర్పాటు చేసే అవకాశం ఉంటుంది. బూడిదెంపాడు నుంచి ఇల్లెందు వరకు ప్రస్తుతం ఉన్న స్తంభాల ద్వారా అదనపు కేబుల్ అమర్చి అదనపు ఫీడర్ ఏర్పాటు చేయడం వల్ల ట్రాన్స్‌కోకు రూ.కోటి వరకు ఖర్చు అయ్యే అవకాశం ఉంది. ఈ ఖర్చును విస్మరిస్తున్న ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు ప్రతి నెలా రూ.లక్షల్లో ఆదాయం కోల్పోతున్నా ప్రత్యామ్నాయం దిశగా ఆలోచన చేయకపోవడం విచారకరం.

ఉన్నతాధికారులకు విన్నవించాం



బూడిదంపాడు 400 కేవీ సబ్‌స్టేషన్ నుంచి ఇల్లెందు 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు ప్రస్తుతం ఒక్క ఫీడర్ ద్వారా మాత్రమే సరఫరా జరుగుతోంది. ఈ ఫీడర్‌లో సమస్య ఉత్పన్నమైతే ఆరు మండలాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. ఈ సమస్యను అధిగమించేందుకు అదనపు ఫీడర్ ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులకు విన్నవించాం. వారి సమాధానం కోసం ఎదురుచూస్తున్నాం.

–కోటేశ్వరరావు, ఏడీఈ, ఇల్లెందు సబ్‌డివిజన్

ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న సాబీర్‌పాషా

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ వేడుకలు జిల్లా మొత్తం ఘనంగా జరపాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్‌కే సాబీర్‌పాషా పిలుపునిచ్చారు. స్థానిక శేషగిరిభవన్‌లో ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సమావేశం ఆదివారం జిల్లా అధ్యక్షుడు కంచర్ల జమలయ్య అధ్యక్షతన నిర్వహించగా సాబీర్‌పాషా పాల్గొని మాట్లాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఏఐటీయూసీ కీలకపాత్ర పోషించిందన్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా అన్ని కార్మిక అడ్డాల వద్ద జెండా ఆవిష్కరణలు చేయాలని కోరారు. సమావేశంలో కడారి వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ, సలిగంటి శ్రీనివాస్, వట్టికొండ మల్లికార్జున్‌రావు, యూసుఫ్, గోనె మణి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బూడిదమయం..



కాల్వలో ప్రవహిస్తున్న కలుషిత నీరు

పాల్వంచరూరల్: మండలంలోని సూరారం, పాండురంగాపురం గ్రామాల వైపు వెళ్లే మార్గంలో బూడిదవాగు నీరు రంగుమారింది. కేటీపీఎస్ యాష్‌పాండ్ నుంచి మొదలై సూరారం, బిక్కుతండా పక్క నుంచి ప్రవహించి కిన్నెరసానిలో కలుస్తుంది. అయితే, కేటీపీఎస్ యాష్‌పాండ్ నుంచి బూడిద నీరు కాల్వలోకి వదలడంతో నీరు రంగుమారి, కలుషితమవుతోంది. కాల్వలో బూడిదనీరు కలవకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దంపతుల ఆత్మహత్యాయత్నం

మజీద్ కాంప్లెక్స్‌లో అద్దె దుకాణాన్ని తొలగించారనే మనస్తాపం..



ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఫాతిమా

పాల్వంచరూరల్ : మజీద్ కాంప్లెక్స్‌లో తాము అద్దెకు తీసుకున్న దుకాణాన్ని తిరిగి కేటాయించకపోగా, సామగ్రిని బయట పడేశారనే మనస్తాపంతో దంపతులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన పాల్వంచలో ఆదివారం చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన సయ్యద్ ఇర్ఫాన్, ఫాతిమా కాంప్లెక్‌లో ఓ షాపు అద్దెకు తీసుకుని ఎలక్ట్రికల్ దుకాణం పెట్టారు. అయితే 15 నెలలుగా అద్దె చెల్లించడం లేదంటూ మజీద్ కమిటీ నిర్వాహకులు గదిని ఇటీవల ఖాళీ చేయించారు. ఈ క్రమంలో వారికి, కమిటీ వారికి వారం రోజులుగా వివాదం జరుగుతోంది. ఇర్ఫాన్ షాపు ఎదుట నిరసన దీక్ష చేస్తుండగా ఆదివారం కమిటీ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దంపతులను స్టేషన్‌కు పిలిచి విచారించారు. దీంతో మనస్తాపం చెందిన ఇర్ఫాన్ పెట్రోల్ పోసుకున్నాడు. నిప్పంటించుకునే లోగానే ఫాతిమా పెట్రోల్ తాగడంతో భర్తే ఆస్పత్రికి తీసుకెళ్లాడు. కాగా, మసీద్ కమిటీ అధ్యక్షుడు ఫయాజుల్లా హసన్ మాట్లాడుతూ.. ఇర్ఫాన్ మసీద్ కమిటీకి 15 నెలలుగా అద్దె చెల్లించడం లేదని, మొత్తం బకాయి రూ.61 వేలకు పైగా ఉందని తెలిపారు. గది ఖాళీ చేయమని చెప్పినా తమ మాట వినకపోవడంతో తామే ఆ సామగ్రిని వేరే చోట భద్రపరిచామని, ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశామని చెప్పారు.

పేకాట స్థావరంపై దాడి

దమ్మపేట: మండలంలోని అల్లిపల్లి గ్రామ శివారులో కోడి పందేల స్థావరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకోగా ఇద్దరు పరారయ్యారని, వారి వద్ద నుంచి రెండు కోడి పుంజులు, నాలుగు ద్విచక్రవాహనాలు, రూ.2030 నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు. వారిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ వెల్లడించారు.

ఈ–బయ్యారంలో...

పినపాక: పేకాట స్థావరంపై దాడి చేసి, పలువురు వ్యక్తులను పోలీసులు అదుపులో తీసుకున్న ఘటన మండలంలోని ఈ–బయ్యారం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కొందరు బయ్యారం శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు దాడి చేసి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ.8 వేలను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రాజ్‌కుమార్ తెలిపారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

కొత్తగూడెంఅర్బన్: భద్రాలచం రోడ్డు రైల్వే స్టేషన్ యార్డులోని జీఎల్–2 టవర్ కార్‌షెడ్ పక్కన ఉన్న రైల్వే ట్రాక్‌పై ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తి రైలుకిందపడి మృతి చెందాడు. ఆర్పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ ప్రభాకర్ కథనం ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి (25–30) (4–4–24, ఐ మిస్‌యూ అమ్మ) అని పచ్చబొట్టు ఉందని, మృతుడి ఒంటిపై బ్లాక్ కలర్ ఫుల్‌షర్ట్, గోధుమ రంగు పా యింటు, నడుముపై పంచరంగుల మొలతాడు ఉన్నాయని, తలభాగం రైలు పట్టాలపై పెట్టడం వల్ల తల సగానికి పగిలిపోయి నుజ్జునుజ్జు అయ్యిందని తెలిపారు. లోకో పైలట్ సమాచారం ఇవ్వడంతో ఆన్ డ్యూటీ డిప్యూటీ స్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు భద్రాచలం రోడ్ రైల్వే జీఆర్పీ ఎస్‌ఐ సురేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాలు తెలిసిన వారు 99890 25481, 87126 58600, 94947 90619, 97013 71472 నంబర్లలో సంప్రదించాలని ప్రభాకర్ సూచించారు.

152 టపాసుల దుకాణాలకు అనుమతి



కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో ఏర్పాటు చేస్తున్న బాణాసంచా షాపులు

కొత్తగూడెంటౌన్: ఈ నెల 31న దీపావళి పండుగ కావడంతో టపాసుల మోత మోగనుంది. పండుగకు ఇంకా మూడు రోజులే ఉండటంతో టపాసుల షాపుల కోసం జిల్లావ్యాప్తంగా దాదాపు 152 దరఖాస్తులు రాగా అన్నింటికి అధికారుల నుంచి అనుమతులు లభించాయి. జిల్లాలోని ఆరు ఫైర్ స్టేషన్ల పరిధిలో బాణాసంచా షాపులకు అనుమతులు ఇచ్చినట్లు జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి మురహరి క్రాంతికుమార్ తెలిపారు. కొత్తగూడెం సింగరేణి ప్రకాశం స్టేడియంలో 40, రామవరంలో 6, రుద్రంపూర్‌లో 1, జూలురుపాడులో 1, ములకలపల్లిలో 1 జగన్నాథపురంలో 1, చండ్రుగొండలో 2, పాల్వంచలో 14 దుకాణాలకు అనుమతులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఇల్లెందులో 34 , భద్రాచలంలో 18, మణుగూరులో 16, అశ్వారావుపేటలో 17, పినపాకలో ఒక దుకాణానికి అనుమతులు ఉన్నాయని వివరించారు.

రక్షణ చర్యలు పాటించాలి

బాణాసంచా దుకాణాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ప్రమాదాలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టాలి. రక్షణ చర్యలు తప్పనిసరిగా పాటించాలి. షాపుల్లోకి మద్యం తాగిన వారిని రానివ్వొద్దు.

–అబ్దుల్ రెహమాన్, కొత్తగూడెం డీఎస్పీ

జాగ్రత్తగా ఉండాలి

బాణాసంచా కాల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి. టపాసుల పేల్చే సమయంలో శబ్ద తీవ్రత 120 డెసిబెల్స్ దాటితే కర్ణభేరికి ప్రమాదం ఏర్పడి వినికిడి శక్తిని కోల్పోయే అవకాశం ఉంటుంది. టపాసుల వల్ల వచ్చే పొగతో అనారోగ్యం పాలవుతారు.

–మురహరి క్రాంతికుమార్, జిల్లా అగ్నిమాపక అధికారి

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

- నలుగురికి తీవ్ర గాయాలు



సోయం సందీప్ మృతదేహం

అశ్వాపురం: మండలంలోని మల్లెలమడుగు హైస్కూల్ సమీపంలో మొండికుంట – భద్రాచలం రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకటాపురం గ్రామానికి చెందిన సోయం సందీప్ (24) మృతి చెందగా మరో నలుగురికి గాయాలయ్యాయి. మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన సోయం సందీప్, కుక్కునూరు మండలం అమరారం గ్రామానికి చెందిన కారం సాయికిరణ్ బైక్‌పై వెంకటాపురం వస్తుండగా నెల్లిపాకబంజర గ్రామానికి చెందిన గొర్రెముచ్చు వేణు మరో ఇద్దరు బైక్‌పై నెల్లిపాకబంజర వెళ్తుండగా రెండు బైక్‌లు మల్లెలమడుగు హైస్కూల్ సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలు కాగా మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. సోయం సందీప్‌ను ఎస్‌ఐ తిరుపతిరావు తన వాహనంలో అశ్వాపురం పీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మిగిలిన వారిని 108లో భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గత ఏడాది అక్టోబర్ 27న మల్లెలమడుగు హైస్కూల్ సమీపంలో రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా ఏడాది తర్వాత ఇదే రోజు ఒకరు మృతి చెంది నలుగురు గాయపడటం చర్చనీయాంశంగా మారింది.

అనారోగ్యంతో భారజల ఉద్యోగి ..

అశ్వాపురం: మణుగూరు భారజల కర్మాగారంలో క్యాప్టివ్ పవర్ ప్లాంటులో ఉద్యోగిగా విధులు నిర్వర్తిస్తున్న దొడ్డా భద్రం (54) అనారోగ్యంతో మండల కేంద్రంలోని గౌతమీనగర్‌కాలనీలోని ఆస్పత్రిలో మృతిచెందాడు. భద్రం మృతదేహానికి భారజల కర్మాగారం జీఎం జగ్గారావు, ఉద్యోగ సంఘం అధ్యక్షుడు పొద్య కేశవరావు నివాళులర్పించారు.

సింగరేణిలో నేటి నుంచి విజిలెన్స్ వారోత్సవాలు



వారోత్సవాల వాల్‌పోస్టర్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో ఈనెల 28 నుంచి నవంబర్ 3వ తేదీ వరకు విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు వాల్ పోస్టర్లు, కరపత్రాలు ముద్రించి వివిధ డిపార్ట్‌మెంట్లలో పంపిణీ చేస్తున్నారు. గనులు, డిపార్ట్‌మెంట్లలో పనిచేస్తున్న ఉద్యోగులు, అధికారులతో సమగ్రతా ప్రతిజ్ఞ చేయించి, అవినీతి వ్యతిరేక ప్రచారానికి సంస్థ మద్దతు తెలుపనుంది. ప్రతి ఉద్యోగి అప్రమత్తతతో విధులు నిర్వహిస్తూ, సంస్థకు నష్టం వాటిల్లే ఘటనలు అరికట్టడంలో తమవంతు కృషి చేయాలని, సంస్థను రానున్న రోజుల్లో అత్యున్నత శిఖరాలకు తీసుకెళ్లేలా కృషి చేయాలని ఈ వారోత్సవాల్లో అవగాహన కల్పించనుంది. ఈ మేరకు ఉద్యోగులకు వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేస్తోంది. సింగరేణిలో అవినీతిని పారదోలడంతో పాటు ఉద్యోగులు బాధ్యతగా వ్యవహరించడం, అక్రమాలకు తావులేకుండా చూసేందుకు 1986లో విజిలెన్స్ విభాగాన్ని ఏర్పాటు చేశారు. దీనికి మొదట్లో ఆర్మీ కల్నల్ స్థాయి అధికారిని నియమించేవారు. సంస్థలో పనిచేసే ఏ స్థాయి అధికారిపై అయినా ఆయనకు విచారణ చేసే అధికారం ఉండేది. ఎవరైనా తప్పు చేస్తే కఠిన శిక్షలు ఉండేవి. అయితే తమపై ఆర్మీ అధికారి పెత్తనం ఏంటని కొందరు ఉన్నతాధికారులు.. సంస్థలో పనిచేసే, రిమార్క్ లేని మైనింగ్, ఎలక్ట్రికల్ విభాగాలకు చెందిన వారిని విజిలెన్స్ జీఎంలుగా నియమించడం ప్రారంభించడంతో ఈ శాఖ పట్ల భక్తి, భయం కార్మికుల్లో సన్నగిల్లిందనే చర్చ జరుగుతోంది.

నాజర్‌పాషాకు ‘సేవారత్న’



అవార్డు అందుకుంటున్న నాజర్‌పాషా

మణుగూరుటౌన్: బహుజన సాహిత్యం అకాడమీ (బీఎస్‌ఏ) ఆధ్వర్యంలో 2024 ఏడాదికి గాను జాతీయ సేవారత్న అవార్డుకు నాజర్‌పాషాను ఎంపిక చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రముఖ గేయ రచయిత మౌనశ్రీ మల్లిక్ చేతులమీదుగా అవార్డును అందించారు. ఈ సందర్భంగా బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సాహిత్యాన్ని ముందుకు తీసుకుపోవడం కోసం బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఏటా ఉద్యమకారులకు, సంఘ సేవకులకు, కవులకు, రచయితలకు, స్వచ్ఛంద సంస్థలకు అవార్డులు అందజేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎం.గౌతమ్, డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్, బాదె వెంకటేశం, ఫణికుమార్, రచయిత్రి వెంకమ్మ, నల్లా జ్యోతి, కోయిల, జమీలాభేగం, హుమాయూన్ పాల్గొన్నారు.

యువత రాజకీయాల్లోకి రావాలి..



పొదెం వీరయ్యను సన్మానిస్తున్న యువత

దుమ్ముగూడెం: యువత రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందని ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య అన్నారు. ఆదివారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వీరమాచినేని వినీల్ ఆధ్వర్యంలో మండలంలోని గంగోలు గ్రామంలో జరిగిన యువజన సదస్సుకు ఆయన హాజరై ప్రసంగించారు. ఒక జాతి నిర్మాణంలో యువత పాత్ర చాలా కీలకమన్నారు. సాంకేతికతను అందిపుచ్చుకుని ముందుకు సాగాలని, తమ శక్తిని జాతి, మంచి సమాజ నిర్మాణం కోసం వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో చింతిర్యాల రవికుమార్, నల్లపు దుర్గాప్రసాద్, చందా సంతోష్, శిరపు అప్పలరెడ్డి, స్వామి, సందీప్‌రెడ్డి, తెల్లం హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కత్తితో అన్నపై తమ్ముడి దాడి

అశ్వారావుపేటరూరల్: కత్తితో అన్నపై తమ్ముడు దాడికి పాల్పడిన ఘటన ఆదివారం రాత్రి అశ్వారావుపేటలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం .. మండల కేంద్రంలోని భగత్‌సింగ్‌సెంటర్‌కు చెందిన దినేశ్, అతని తమ్ముడు రవి మధ్య ఓ విషయంలో వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో అన్నపై కత్తితో తమ్ముడు దాడికి పాల్పడ్డాడు. దినేశ్ చేయి, గొంతుతో పాటు పలుచోట్ల తీవ్ర గాయాలయ్యాయి. రక్తస్రావం అధికం కావడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లగా, కుటుంబీకులు అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి...

కారేపల్లి: పురుగులమందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతిచెందాడు. మహబూబాబాద్ జిల్లా తూర్పుతండాకు చెందిన బాణోతు చక్రి (21) ఖమ్మంలో పానిపూరి బండి నడుపుతున్నాడు. నెల రోజుల నుంచి పానిపూరి బండి తీయకుండా తిరుగుతుండటంతో తల్లి మందలించింది. మనస్తాపం చెందిన చక్రి కారేపల్లి మండలం ఉసిరికాయపల్లి సోలార్ ప్లాంట్ వద్ద ఈనెల 26న పురుగులమందు తాగాడు. కుటుంబసభ్యులు చక్రిని ఖమ్మంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఎస్‌ఐ రాజారాం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.